క్లుప్తంగా

టీటీడీ డీఈఓకు సత్కారం


టీటీడీ డీఈఓను సన్మానిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజనాయుడును శనివారం టీటీడీ జనరల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అమ్మిడి ముని వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ టీటీడీ విద్యాసంస్థలు, వసతి గృహాలు, స్కూళ్లల్లో త్వరితగతిన ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు. దీనిపై డీఈఓ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.బట్టు, రవి కుమార్, కరుణాకర్, గీత చెన్నయ్య, లోకేష్, రేవంత్ పాల్గొన్నారు.

శ్రీవారిని సేవలో అద్మార్ మఠాధిపతి


శ్రీవారి ధ్వజ స్తంభం వద్ద విశ్వప్రియ తీర్థ స్వామీజీతో జేఈఓ వీరబ్రహ్మం

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం ఉడిపిలోని అద్మార్ మఠాధిపతి విశ్వప్రియ తీర్థ స్వామీజీ సేవించుకున్నారు. శనివారం తిరుమల బేడి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆయనకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం స్వాగతం పలికారు. దర్శనానంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పల్లె వెలుగు ప్లాట్‌ఫామ్‌లకు బోర్డులు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలోని పల్లెవెలుగు బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్‌లకు కొత్త బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. 11.5 ఎకరాల విస్తీర్ణంలోని బస్టాండ్‌లో మొత్తం 64 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. శ్రీహరి బస్టాండ్‌లో 1 నుంచి 20 వరకు, శ్రీనివాస బస్టాండ్‌లో 21 నుంచి 44 వరకు, ఏడుకొండల బస్టాండ్‌లో 45 నుంచి 57 వరకు, పల్లెవెలుగు బస్టాండ్‌లో 58 నుంచి 64 ప్లాట్‌ఫామ్‌ల వరకు ఉన్నాయి. పల్లెవెలుగు బస్టాండ్‌లో ఏ ప్లాట్‌ఫామ్‌లో ఏ ఊరు బస్సులు ఆగుతాయో తెలియజేసే బోర్డులు పాతవి కావడంతో సగం మాత్రమే కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో 58 నుంచి 64 ప్లాట్‌ఫామ్‌ల వరకు కొత్తబోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అయితే మిగిలిన 1 నుంచి 57 వరకు ఉన్న ప్లాట్‌ఫామ్‌లలో ఊర్ల పేర్లు బోర్డుల్లో కాకుండా గోడలపై రాసి ఉన్నారు. అయితే ఆ బోర్డుల పరిస్థితి అలానే ఉంది. సగం అక్షరాలు మాత్రమే కనిపిస్తున్నాయి. కొత్తగా ఊరు పేర్లు గోడలపై రాయిస్తే ఇబ్బంది తప్పుతుందని ప్రయాణికులకు కోరుతున్నారు.

పోలవరంపై విచారణ అవసరం


మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి కల్చరల్: దాదాపు 30 ఏళ్ల క్రితం ప్రారంభమైన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం నేటికీ పూర్తికాకపోవడం విచారకరమని, ఈ జాప్యంపై విచారణ అవసరమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలో కలెక్టర్ పోస్టింగ్ ఇచ్చేందుకు బీజేపీ మంత్రులు రూ.5 కోట్లు లంచం తీసుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. టీటీడీ, ప్రభుత్వ ఉద్యోగులు, వర్కింగ్ జర్నలిస్టులకు జూ పార్క్ ప్రాంతంలో ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. అలిపిరి సమీపంలోని జూ పార్క్ ఏడువేల ఎకరాల్లో ఉందని, పార్క్‌ను వేరే చోటికి మార్చి అక్కడ ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని సూచించారు. మన్నవరం బెల్ ఫ్యాక్టరీ, దుగరాజపట్నం ఓడరేవు, తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, శాంతి యాదవ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

అడుగడుగునా బడుగుల అణచివేత

తిరుపతి కల్చరల్: రాయలసీమలో అడుగడుగునా బడుగులు అణచివేతకు గురవుతున్నారని బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ పూర్ణచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బైరాగిపట్టెడలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో బహుజన సమాజ్ పార్టీ జోనల్ సమావేశం నిర్వహించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కులాధిక్య రాజకీయాలు నడుస్తున్నాయని, వీటిపై గ్రామీణులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొన్ని కులాలే రాజ్యమేలుతున్నాయన్నారు. అధిక శాతం జనాభా కలిగిన బడుగు, బలహీన వర్గాలు అణగదొక్కబడుతున్నాయని తెలిపారు. సీమలో నిరుద్యోగం 82 శాతం, పేదరికం 76శాతం, అక్షరాస్యత 42 శాతం ఉన్నాయని వివరించారు. ఇప్పుడు స్కిల్ సెన్సస్ అంటూ టీడీపీ కొత్త నాటకానికి తెరతీసిందన్నారు. బీఎస్పీ రాయలసీమ కో–ఆర్డినేటర్, రిటైర్డ్ జడ్జి పి.గురప్ప, రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, ఉపాధ్యక్షుడు గౌతమ్, రాయలసీమ జోనల్ కో–ఆర్డినేటర్ ఆర్‌జే.మల్లికల్, టి.విజయకుమార్, జానకిప్రసాద్, సురేంద్ర, ప్రభాకర్ పాల్గొన్నారు.

నారీ నిర్వేదం



రాష్ట్రంలో అతివలకు భద్రత కరువైంది. చిన్నారులకు కూడా రక్షణ లేకుండా పోయింది.. అభం శుభం తెలియని పసికందులపై సైతం మానవమృగాలు లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. సభ్య సమాజం తలదించుకునేలా అకృత్యాలకు ఒడిగడుతున్నారు. మహిళల మాన ప్రాణాలతో యథేచ్ఛగా చెలగాటమాడుతున్నారు. ఈ క్రమంలో కఠినంగా వ్యవహరించాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు మీనమేషాలు లెక్కిస్తున్నారు. చట్టాలను నిందితులకు చుట్టాలుగా మార్చేస్తున్నారు. యువతను మత్తుకు బానిసలుగా మార్చేసి దేశ భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తున్నారు. మద్యం.. గంజాయిని చేతికందించి అఘాయిత్యాలకు తెగబడేలా దిగజారుస్తున్నారు. సర్కారు తీరుపై విద్యార్థి.. మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. చిత్తశుద్ధితో చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. స్త్రీ జోలికి వచ్చిన వారికి కఠిన శిక్షలు విధించాలని స్పష్టం చేస్తున్నాయి. లేకుంటే ఉద్యమాలతో కదం తొక్కుతామని హెచ్చరిస్తున్నాయి.

–తిరుపతి సిటీ

- ప్రజాస్వామ్యంలో అతివలకు రక్షణ లేదా..?
- చిత్తశుద్ధితో చట్టాలను అమలు చేయరా..?
- మానవమృగాలపై చర్యలు తీసుకోరా..?
- పసికందులను పొట్టనబెట్టుకున్నా పట్టించుకోరా..?
- ప్రభుత్వంపై విద్యార్థి.. మహిళా సంఘాల మండిపాటు

ఆలస్యం కావడంతోనే..



జిల్లాలోని దొరవారిసత్రంతోపాటు, నంద్యాల జిల్లాలో 8 ఏళ్లలోపు మైనర్‌బాలికలపై లైంగిక దాడికి పాల్పడి హతమార్చిన ఘటనలను చూసి సభ్య సమాజం తలదించుకుంటోంది. మహిళలపై కామాంధులు దాడిచేస్తే కఠిన శిక్షపడే చట్టాలు మచ్చుకైనా కనపడటం లేదు. 10 ఏళ్ల నుంచి 20 ఏళ్లకు కానీ, ఈ కేసుల్లో తీర్పులు రావడం లేదు. ఆలస్యం కావడంతో కేసును నీరుగార్చేస్తున్నారు. దీంతో నిందితులు దర్జాగా తిరుగుతూ మరిన్ని దాడులకు పాల్పడుతున్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం గాలికొదిలేసింది. అదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం నడచుకోవడం దారుణం. **–లక్ష్మమ్మ, గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్, తిరుపతి**

చట్టాల అమలులో విఫలం



ఆడవారిలో ఎలా నడుచుకోవాలో పిల్లలకు విద్యార్థి దశ నుంచే పాఠశాలల్లో బోధించాలి. తల్లిదండ్రులు సైతం బాధ్యతగా తమ పాత్ర పోషించాలి. లైంగికదాడులకు పాల్పడేవారిపై ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేయడంలో విఫలమైంది. తూతూ మంత్రంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయించి చేతులు దులిపేసుకుంటోంది. నేరం చేసిన వారంలోపే నిందితులకు శిక్ష పడేలా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏది ఏమైనా మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. **–సాయిలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి, తిరుపతి**

అవగాహన ఊసేలేదు



మహిళలతో ఎలా మసలుకోవాలో తెలియజేసే అవగాహన కార్యక్రమాలను విద్యార్థి దశ నుంచే పాఠశాలలలో ఏర్పాటు చేయాలి. లైంగిదాడులకు కారణమవుతున్న మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని పూర్తిస్థాయిలో నివారించాల్సి బాధ్యత ప్రభుత్వానిదే. ఘటన జరిగితేనే స్పందించే సమాజంలో మార్పురావాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను సరైన పద్ధతులలో పెంచాల్సిన అవసరం ఉంది. పాలకులే తమ రాజకీయ అవసరాల కోసం కొందరు నిందితులకు అండగా నిలుస్తున్నారు. ఇలాంటివి జరిగినప్పుడు బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. **–ప్రీతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కో–కన్వీనర్, తిరుపతి**

మొసలి కన్నీరు కారుస్తున్నారు



ప్రభుత్వం మహిళ రక్షణను విస్మరించింది. రాష్ట్రవ్యాప్తంగా నిత్యం ప్రతి 100 మందిలో 60 మందికి పైగా మహిళలు వేధింపులకు గురవుతున్నారు. ఇందులో 90శాతం బాధితులు సమాజానికి భయపడి బయటపడడం లేదు. హత్యా, లైంగికదాడి జరిగినప్పుడు మాత్రం పాలకులు మొసలి కన్నీరు కారుస్తున్నారు. మద్యం, అసభ్యదృశ్యాలు, పోర్న్ సైట్లకు యువత బానిసలవుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోంది. యువతను చైతన్యవంతం చేసే కార్యక్రమాల జోలికి అస్సలు వెళ్లడం లేదు. మైనర్ బాలికలను సైతం కబళిస్తున్న మానవమృగాలకు తగిన శిక్ష వేయించేందుకు మహిళా లోకం రోడెక్కి పోరాటాలు చేయాల్సివస్తోంది. **–ఆషా, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి, తిరుపతి**

గళమెత్తాల్సిన అవసరముంది



మహిళలను నేటి సమాజం ఆటవస్తువులుగా చూడటం దారుణం. స్త్రీ నవసమాజ నిర్మాత అనే విషయాన్ని యువతరానికి తెలియజేయాలి. ప్రాచీన కాలం నుంచి స్త్రీ జాతిని బానిసగా చూస్తూ రావడం దురదృష్టకరం. నేటి సమాజంలో మార్పు తేవడానికి రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఎన్నికల ముందు మహిళల సంక్షేమం, రక్షణే మాధ్యేయం అంటూ ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే మహిళలను ప్రజాప్రతినిధులే వేధిస్తున్నారు. బానిస సంకెళ్ల నుంచి విముక్తి కోసం మహిళాలోకం గళమెత్తాల్సిన అవసరముంది. **–హరిత, ఎస్ఎఫ్ఐ, గర్ల్స్ విభాగం కన్వీనర్, తిరుపతి**

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న వైభవం


తిరుచ్చిపై విహరిస్తున్న దేవదేవేరులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం శ్రీవారికి అభిషేక సేవ నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుద్దీపాల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు, ఉభయ దేవేరీ సమేతంగా బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో లోన్ దరఖాస్తుకు అవకాశం

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకులో రుణాల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు బ్యాంకు అధ్యక్షుడు వాసు, ఉపాధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ గతంలో లోన్ కోసం ఉద్యోగులు మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేదన్నారు. ఆ ఇబ్బందులను తొలగించేందుకే ఆన్‌లైన్ వెసులుబాటు ఇస్తున్నట్లు వివరించారు. లోన్ కోసం దరఖాస్తు చేసుకునే ఉద్యోగులు https://ehrmaps.tirumala.org వెబ్‌సైట్ ద్వారా బ్యాంకుకు పంపించాలని సూచించారు. అప్లికేషన్‌ను బ్యాంకులో ప్రింట్ తీసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పరిపూర్ణం.. పవిత్రోత్సవం


తిరుచ్చిపై ఊరేగుతున్న పంచమూర్తులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శనివారం మహాపూర్ణాహుతితో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ఆవరణలోని యాగశాలలో పూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టు పవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం పంచమూర్తులైన సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, చండికేశ్వరస్వామి వారి వీధి ఉత్సవాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులకు పవిత్ర మాల, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ కృష్ణ వర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

సంప్రదాయ కళలకు జీవం పోద్దాం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: భారతదేశ సంస్కృతి, సంప్రదాయానికి చిహ్నమైన కళా సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. అభినయ్ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవంలో భాగంగా మహతి కళాక్షేత్రంలో తలపెట్టిన తొమ్మిది రోజుల జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారి శివరామకృష్ణ, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, టీటీడీ ధర్మప్రచార పరిషత్ మాజీ డైరెక్టర్ చెన్నకేశవుల నాయుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి, గేట్ విద్యాసంస్థల అధినేత తమ్మినేని వెంకటేశ్వర్లు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, నాగిశెట్టి బాలాజీ తదితరులు హాజరై ప్రసంగించారు. గత 24 ఏళ్లుగా అభినయ్ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్.రెడ్డి సేవలు అభినందనీయమని కొనియాడారు. అభినయ్ ఆర్ట్స్ అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, ప్రతినిధులు విజయకుమార్, ఈరమునిశేఖర జయచంద్ర, శ్రీనివాసులురెడ్డి, ఎస్.ధర్మయ్య, మర్థం గజేంద్ర పాల్గొన్నారు.

తక్షణమే ప్రజా సమస్యల పరిష్కారం


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ అదితీసింగ్

తిరుపతి తుడా: నగరంలో ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితీసింగ్ ఆదేశించారు. శనివారం తెల్లవారుజాము నుంచి నగరంలో పారిశుద్ధ్య పనులు, పార్కుల నిర్వహణను హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో కార్పొరేటర్ ఆరణి సంధ్య ఇచ్చిన వినతుల మేరకు ఎమ్మార్‌పల్లె కూడలి, పోలీస్‌స్టేషన్, వైకుంఠపురం ఆర్చి, పార్కు, న్యాయవాదుల కాలనీ, ఈఎస్ఐ హాస్పిటల్ తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీలు, తాగునీటి సరఫరాను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెద్ద సంఖ్యలో జనం వినతులు ఇస్తున్నారని, వాటన్నింటినీ పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. మేజర్ సమస్యలను తానే స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. తాగునీటి సాంద్రత, అంగన్‌వాడీ కేంద్రాల్లో వడ్డించే ఆహారాన్ని రోజూ పరీక్షిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ కొత్త పల్సర్ ఎన్ఎస్ 400 ఆవిష్కరణ


కొత్త బైక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, షోరూమ్ అధినేతలు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని శ్రీరామ్ ఎంటర్‌ప్రైజెస్ షోరూమ్‌లో శనివారం బజాజ్ వారి కొత్త పల్సర్ ఎన్ఎస్400 బైక్‌ను శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక కాలానికి అనుగుణంగా సరికొత్త ఫీచర్స్‌తో పల్సర్ ఎన్ఎస్400 మార్కెట్‌లో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం షోరూమ్ అధినేతలు శ్రీనివాసరావు, సాకేత్‌రామ్ మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా తమ షోరూమ్ ద్వారా బజాజ్ వాహనాలను సరికొత్త టెక్నాలజీతో మార్కెట్‌లోకి తీసుకువస్తున్నామని వెల్లడించారు. ఈ కొత్త వాహనం 373 సీసీ ఇంజిన్‌తో శక్తివంతమైన వేగంతో వెళ్లే సౌలభ్యం కలిగి ఉందన్నారు. అంతేకాక 40 బీహెచ్‌పీ శక్తి ఉత్పత్తితో స్పీడ్ పవర్ టైయిన్ ద్వారా వెనుక చక్రానికి 35 ఎంఎం టార్క్ సపోర్టు చేస్తుందని తెలిపారు. ఎల్ఈడీ లైటింగ్, టర్న్ బై టర్న్ నావిగేషన్, డిస్‌ప్లేతో కూడిన డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, బ్లూటూత్ కనెక్టివిటీ సదుపాయాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో షోరూమ్ మరో అధినేత అభినవరామ్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు అన్యాయం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దామినేటి కేశవులు

తిరుపతి కల్చరల్: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దామినేటి కేశవులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే నాని సతీమణి సుధారెడ్డి సైతం రాజకీయ, వ్యక్తిగత విమర్శలు మానుకొని చంద్రగిరి నియోజకవర్గంలో ప్రశాంతతకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నడూ ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దాడులు లేవని వెల్లడించారు. రాజకీయంగా అధికార పక్షం, ప్రతిపక్షం నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమంపై మాట్లాడడం సాధారణమేనన్నారు. అయితే చంద్రగిరిలో పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. పులివర్తి నానిపై దాడి సమయంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి లేకున్నా అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తూ ఉంటారని తెలిపారు. తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, సర్పంచ్ చిన్ని యాదవ్, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సుబ్రమణ్యం, భాను, ఎంపీటీసీ సభ్యుడు శివశంకర్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగ అరెస్ట్

తిరుపతి క్రైమ్: జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను క్రైమ్ పోలీస్ అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. ఆయన కథనం.. తిరుపతి రూరల్, గాంధీపురానికి చెందిన గుండ్లపాటి మునిరాజ్గా నుంచి రూ.8,30,000 విలువ చేస్తే 137 గ్రాములు బంగారం, 300 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం


ర్యాలీ నిర్వహిస్తున్న మెకానిక్ సంఘం సభ్యులు

తిరుపతి కల్చరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం సాగించాలని టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తిరుపతిలో హెల్మెట్ వాడకంపై మెకానిక్ లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీభవన్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో మునిరెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుంచి వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. అందులో భాగంగా తొలి విడతలో 35 మంది మెకానిక్‌లకు పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించామని వివరించారు. మిలిగిన సభ్యులకు మూడు నెలల్లో దశల వారీగా ఇన్సూరెన్స్ చేయించనున్నట్లు భరోసా ఇచ్చారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి జలంధర్, ప్రతినిధులు లక్ష్మణరావు, గురు, ప్రభు, మల్లేశర్, గౌస్ భాషా, కమిటీ ఇన్‌చార్జి సోమశేఖర్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల విడుదలకు డిమాండ్


వీసీకి వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిగ్రీ రెండు, ఐదు, ఆరో సెమిస్టర్ సైతం పూర్తైయ్యాయని, అయితే ఇప్పటికీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, నరేంద్ర, వినోద్, సుష్మిత, వీరేష్, సాయి, భార్గవ్, సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం తిరుపతిలోని ఆ బ్యాంకు శాఖలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రీజియన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, రీజనల్ హెడ్ పి.అమరనాథరెడ్డి మాట్లాడుతూ బ్యాంకు 117వ సంవత్సరానికి సంబంధించిన థీమ్ ‘ట్రస్టెడ్ టుడే ట్రాన్స్‌ఫార్మింగ్ టుమారో’, బ్యాంక్ పెద్ద కలలను కనడం, శ్రేష్ఠత కోసం కృషి చేయడం , పటిష్టమైన, మరింత సంపన్నమైన భాగస్వామ్య భవిష్యత్‌ను నిర్మించడం కోసం అజెండా రూపొందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకును దార్శనికుడు, సంస్కర్త అయిన మహారాజా సాయాజీ రావు గైక్వాడ్ స్థాపించారన్నారు. 1908లో బరోడాలోని మాండ్విలో ఏర్పాటైన మొదటి శాఖ నుంచి బ్యాంక్ ఆఫ్ బరోడా నేడు దేశంలోనే రెండో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుగా పేరుపొందిందని వెల్లడించారు. 17 దేశాలలో తమ బ్యాంకు సేవలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్, ఎంఎస్ఎంఈ, విజ్ఞాన, వైద్య, సాహిత్య, సామాజిక సేవ, పారిశ్రామిక, క్రీడలు, కళలు, చలనచిత్ర రంగాల్లో విశేష కృషి చేసిన వినియోగదారులను సత్కరించారు. అనంతరం డిప్యూటీ రీజనల్ హెడ్ బి.ప్రసాద్, తన సిబ్బందితో కలిసి కృష్ణ తేజ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో బరోడా అనుభూతి–కమ్యూనిటీ సర్వీస్ / సోషల్ యాక్టివిటీ ఇనిషియేటివ్స్ కార్యక్రమంలో భాగంగా 1,117 పండ్ల మొక్కలను నాటారు. గ్రూప్ థియేటర్ నుంచి అన్నారావు సర్కిల్ లోని బ్యాంకు బ్రాంచ్ వరకు వాకథాన్ నిర్వహించారు.

సమష్టిగా కుష్టు నివారణకు కృషి


మాట్లాడుతున్న డాక్టర్ రాజా

భాకరాపేట: వైద్య ఆరోగ్య సిబ్బంది సమష్టిగా కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలని కుష్టు, క్షయ వ్యాధి నిర్మూలన జిల్లా అధికారి డాక్టరు రాజా కోరారు. శనివారం భాకరాపేట పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాజా మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలు, పొడలు, లావుగా మారి నొప్పితో కూడిన నరాలు, బుడిపెలు, నొప్పిలేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారడం, ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా ఉండడం మొదలైన లక్షణాలుంటే కుష్టు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఇంటింటి సర్వే నిర్వహస్తున్నామని వెల్లడించారు. ఎంఓ అలెగ్జాండర్, డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్, సీహెచ్‌ఓ శేషుకుమారి పాల్గొన్నారు.